క్లుప్తంగా

నూకాలమ్మకు విశిష్ట పూజలు



ప్రత్యేక అలంకరణలో నూకాలమ్మ అమ్మవారు

విజయనగరం టౌన్: స్థానిక మంగళవీధిలో కొలువైన నూకాలమ్మ అమ్మవారికి శనివారం విశిష్ట పూజలు నిర్వహించారు. ఆలయ 65వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయం వెనుక ఉన్న వేపచెట్టు వద్ద దీపారాధనలు చేశారు. ఈ నెల 21న అమ్మవారి చల్లదన మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. అదేరోజు రాత్రి 11 గంటలకు గుడి తలుపులు వేసి, తిరిగి 23వ తేదీన గురువారం తీస్తారన్నారు. భక్తులందరూ అమ్మవారిని దర్శించి, తరించాలని కోరారు.

కలెక్టరేట్‌లో ఉద్యోగుల నిరసన

విజయనగరం ఫోర్ట్: ఏపీజేఏసీ అమరావతి ఉద్యమ కార్యాచరణలో భాగంగా శనివారం జేఏసీ ప్రధాన కార్యదర్శి పులిశెట్టి దామోదరరావు, రాష్ట్ర సలహాదారు డి.జి.ప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్‌లో 'చేయి చేయి కలుపుదాం.. ఉద్యమాన్ని ఉధృతం చేద్దాం' కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో జేఏసీ జిల్లా అధ్యక్షుడు రమణరాజు, ప్రధానకార్యదర్శి ఎ.విజయ్‌కుమార్, రెవెన్యూ సంఘం అధ్యక్షుడు తాడి గోవింద, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధ్యక్షుడు రమణమూర్తి, పి.భానుమూర్తి, పద్మనాభం పాల్గొన్నారు.

వైకుంఠ నారాయణునికి పూజలు



దేవతామూర్తులకు అభిషేకం చేస్తున్న అర్చకులు

విజయనగరం రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం రామనారాయణంలో వైకుంఠ నారాయణునికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు చాణక్య ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత వైకుంఠ నారాయణునికి వేదమంత్రాల నడుమ స్నపనం, అర్చన, పంచామృతభిషేకం నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో ఎన్‌సీఎస్ ట్రస్ట్ సభ్యులు నారాయణం శ్రీనివాస్, నీరజవల్లి దంపతులు, మేనేజర్లు శ్రీనివాసరాజు, ఎంవీ రమణ, భక్తులు పాల్గొన్నారు.

ఆశ వర్కర్ల వినతి



డీఎంహెచ్‌ఓకు వినతిపత్రం అందజేస్తున్న ఆశ వర్కర్లు

విజయనగరం ఫోర్ట్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 21న డీఎంహెచ్‌ఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్టు ఏపీ ఆశావర్కర్ల యూనియన్ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు శనివారం డీఎంహెచ్‌ఓ ఎస్.వి.రమణకుమారికి నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశా వర్కర్లకు రూ.26 వేలు వేతనం ఇవ్వాలని, పని భారం తగ్గించాలని, కోవిడ్ సమయంలో మరణించిన ఆశావర్కర్లకు రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేసియో ఇవ్వాలని కోరారు. యూనియన్ జిల్లా కార్యదర్శి బొత్స సుధారాణి, వి.మాళవిక, ఎం.పద్మావతి, ఎన్.సంతోషి, గిరిష పాల్గొన్నారు.

డెంకాడ: ఆశా వర్కర్ల సమస్యలపై ఏపీ ఆశా వర్కర్ల యూనియన్ ప్రతినిధులు శనివారం డెంకాడ పీహెచ్‌సీ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఆశా వర్కర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

మండల పరిషత్‌లో స్పందన

నెల్లిమర్ల: మండల పరిషత్ కార్యాలయంలో ప్రతీ సోమవారం మండలస్థాయి స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జి.గిరిబాల శనివారం తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందించవచ్చన్నారు. అన్ని విభాగాల అధికారులు స్పందనలో అందుబాటులో ఉంటారని తెలిపారు.

అలరించిన ధర్మపథం

నెల్లిమర్ల రూరల్: దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో శనివారం ఏర్పాటు చేసిన ధర్మపథం కార్యక్రమం భక్తులను ఎంతగానో అలరించింది. చీపురుపల్లి మండలం ఇప్పలవలస గ్రామానికి చెందిన శ్రీరామ భజన బృందం కళాకారులు స్వామి సన్నిధిలో భక్తిగీతాలు ఆలపించారు. ఈఓ ప్రసాదరావు కళాకారులను అభినందించి దేవాదాయశాఖ తరఫున ప్రశంసా పత్రాలు అందజేశారు.

పన్ను చెల్లిస్తే.. వడ్డీ మాఫీ

- ఈ నెలాఖరు వరకు అవకాశం
- కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు



మాట్లాడుతున్న కమిషనర్ శ్రీరాములనాయుడు

విజయనగరం: నగరపరిధిలోని ఆస్తి, ఖాళీ స్థలముల పన్ను బకాయిలకు విధించిన వడ్డీని ప్రభుత్వం మాఫీ చేసిన నేపథ్యంలో పన్ను చెల్లింపుదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేషన్ కమిషనర్ ఆర్.శ్రీరాములునాయుడు తెలిపారు. శనివారం ఆయన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. మార్చి 31వ తేదీలోగా ఏకమొత్తంలో పన్నులను చెల్లించినట్లయితే పూర్తి వడ్డీ మాఫీ అవుతుందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నగరంలో 67,480 అసెస్మెంట్లు ఉన్నాయన్నారు. వాటి ద్వారా పాత పన్ను బకాయిలు రూ.15.67 కోట్ల కాగా, రూ.20.27 కోట్ల వడ్డీగా రావాల్సి ఉందన్నారు. పన్ను చెల్లింపుదారుల సౌకర్యార్థం నగరపాలక సంస్థ కార్యాలయంలో మూడు కౌంటర్లను ఏర్పాటు చేశామన్నారు. అలాగే 10 సచివాలయాలకు ఒక టీం చొప్పున మొత్తం 12 టీంలను ఏర్పాటు చేసామన్నారు. పన్ను చెల్లింపుదారులకు మొబైల్ బృందాలు కూడా సహకరిస్తాయని చెప్పారు. పన్ను చెల్లింపులను చెక్కుల ద్వారా నగదు ద్వారా ఆన్‌లైన్‌లో గాని, సచివాలయాలలో గాని, నగరపాలక సంస్థ కార్యాలయంలో గాని, లేదా ఇంటి వద్దకు వచ్చే ప్రత్యేక బృందాలకు గానీ చెల్లించవచ్చన్నారు. అదేవిధంగా ఖాళీ స్థలాల పన్ను బకాయి రూ.2.05 కోట్లు కాగా, మరో కోటి రూపాయలు వడ్డీ రావాల్సి ఉందన్నారు. పన్ను చెల్లింపుదారులు ఈ నెల 31లోగా ఒకే సారి మొత్తం బకాయిని చెల్లించినట్లయితే వడ్డీ రాయితీ వర్తిస్తుందన్నారు. ప్రజలు పన్నులు చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని కోరారు. ఆయనతో పాటు సహాయ కమిషనర్ ప్రసాదరావు ఉన్నారు.

సమాజహిత కార్యక్రమాలకు సహకరిస్తాం..

- డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి



ఉపనయనాలు అనంతరం వటులు

విజయనగరం: సమాజహిత కార్యక్రమాలు చేపట్టే ఏ సంస్థకైనా తమవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. నగరంలోని కొత్త అగ్రహారంలో ఉన్న ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో శనివారం నిర్వహించిన సామూహిక ఉపనయన కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కోలగట్ల వెంకటరమణితో కలిసి పాల్గొని వటులను ఆశీర్వదించారు. జిల్లా బ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘం, జిల్లా అర్చక పురోహిత సంఘం ఆధ్వర్యంలో ఉచిత సామూహిక ఉపనయనాలు జరిగాయి. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వటులచే శాస్త్రోక్తంగా ఉపనయన స్వీకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా శ్రావణి మాట్లాడుతూ..శాస్త్రోక్తంగా వైదిక కార్యక్రమాలు నిర్వహించడం వలన సమాజం మరింత వర్ధిల్లుతుందన్నారు. అనంతరం సంఘం తరఫున కోలగట్ల శ్రావణి, కోలగట్ల వెంకటరమణిలను సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా బ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘం సమాఖ్య అధ్యక్షుడు టీవీ శ్రీనివాసరావు, ఆడిటర్ రాంజీ, జిల్లా అర్చక పురోహిత సంఘం అధ్యక్షుడు భమిడిపాటి రామ్‌కుమార్ శర్మ, రామాయణం సత్యనారాయణ శర్మ, భమిడిపాటి జోగేష్‌శర్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టుల నిర్మాణం పూర్తిచేయాలని వినతి

విజయనగరం ఫూల్‌బాగ్: జల ప్రాజెక్టులను సత్వరం నిర్మించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గదుల వెంకటరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం జలవనరులశాఖ అధికారి కె.లోకేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయనతో పాటు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ముడిలి నాగభూషణరావు, కార్యదర్శి పందిరి లక్ష్మణరెడ్డి, తదితరులు ఉన్నారు.

వృథాగా వదిలేశారు



నిరుపయోగంగా ఉన్న సామూహిక మరుగుదొడ్లు

విజయనగరం రూరల్: మండలంలోని కోరుకొండ గ్రామంలో రూ.7 లక్షలతో నిర్మించిన సామూహిక మరుగుదొడ్లు కొన్నేళ్లుగా నిరుపయోగంగా ఉన్నాయని గ్రామస్తులు అంటున్నారు. రన్నింగ్ వాటర్, విద్యుత్ సౌకర్యం ఉన్నా.. వాటి నిర్వహణ బాధ్యతలను చూసేవారు లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకువెళ్లగా.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి వాటిని ఉపయోగంలోకి తీసుకువస్తామన్నారు.

స్వచ్ఛత అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లిమర్ల: నగరపంచాయతీకి చెందిన మహిళలు స్వచ్ఛత అవార్డులకు దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్ శనివారం ఓ ప్రకటనలో సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణలో ప్రతిభ కనబరిచిన మహిళలకు 'ఉమెన్ ఐకాన్ లీడింగ్ స్వచ్ఛత-2023' అవార్డులను అందజేయనున్నట్లు పేర్కొన్నారు. మరుగుదొడ్ల నిర్వహణ, మురుగునీటిని శుద్ధిచేసి తిరిగి వినియోగించడం, తడి, పొడి చెత్త సేకరణ, చెత్త నుంచి సంపద తయారీ, చెత్తతో కళాకృతుల తయారీ తదితర విభాగాల్లో ప్రతిభ కనబరిచిన మహిళలు ఈ నెల 22వ తేదీలోగా తమ దరఖాస్తులను నగరపంచాయతీ కార్యాలయంలోని మెప్మా విభాగంలో అందజేయాలని సూచించారు. ఎంపికైన మహిళలకు జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకల్లో అవార్డులు అందజేయనున్నట్లు తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేయాలి



ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి శాంతకుమారి, తదితరులు



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ స్వరూపారాణి

పూసపాటిరేగ: జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేయాలని మండల ప్రత్యేకాధికారి బి.శాంతకుమారి అన్నారు. పూసపాటిరేగ గ్రామంలోని జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను శనివారం పరిశీలించారు. కాలనీలో 75 శాతం వరకు గృహనిర్మాణాలు చివరిదశకు చేరుకున్నాయన్నారు. మిగతా లబ్ధిదారులు నిర్మాణాలు ప్రారంభించాలని సూచించారు. నిర్మాణాలు చేపడుతున్న లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు చెల్లిస్తున్నట్లు చెప్పారు. లేఅవుట్‌లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని లబ్ధిదారులు అధికారులను కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామరావు, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు పాల్గొన్నారు. అనంతరం పూసపాటిరేగ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకంను పరిశీలించారు.

డెంకాడ: జగనన్న కాలనీల్లో ఇళ్లను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ స్వరూపారాణి లబ్ధిదారులకు సూచించారు. మండలంలోని గుణుపూరుపేట జగనన్న కాలనీలో శనివారం హౌసింగ్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించకపోతే వాటిని రద్దయ్యే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం ఈ కాలనీలో 60 నిర్మాణాలు బేస్‌మెంట్ లెవెల్ వరకు పూర్తయినట్లు చెప్పారు. వాటిని త్వరగా పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. అనంతరం గుణుపూరుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు.

ప్రపంచ ఆర్థిక వనరుగా భారత్



సావినార్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు, అధ్యాపకులు

- లెండిలో ముగిసిన లక్ష్య 2కె23



నృత్యం చేస్తున్న విద్యార్థులు

డెంకాడ: ప్రపంచ ఆర్థిక వనరుగా భారతదేశం మారబోతోందని కాగ్నిజెంట్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఎం.మహేష్ అన్నారు. జొన్నాడ వద్ద ఉన్న లెండి ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం విద్యార్థి సంఘం లక్ష్య- 2కె23 పేరుతో నిర్వహించిన వార్షికోత్సవం శనివారంతో ముగిసింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల పూర్వవిద్యార్థి మహేష్ మాట్లాడుతూ.. విద్యార్థులకు సాంకేతికలో వస్తున్న మార్పులకు అనుగుణంగా నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలని సూచించారు. కళాశాలలో జరిగిన వివిధ సాంకేతిక ప్రదర్శనల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ రామారెడ్డి, విభాగాధిపతి కె.సుబ్బరామయ్య బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ డీన్ ప్రకాష్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ టి.హరిబాబు, అధ్యాపకులు బీవీఎస్ ఆచార్యులు, మంగరాజు, పి.జానకి, కె.ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ విద్యాసాగర్

నెల్లిమర్ల రూరల్: ప్రాథమిక దశలో క్యాన్సర్ గుర్తిస్తే నివారణకు అవకాశం ఉంటుందని ఒమెగా ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ విద్యాసాగర్ అన్నారు. మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో క్యాన్సర్ వ్యాధిపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత్‌లో 2020 నాటికి 19.3 మిలియన్ మంది క్యాన్సర్ బాధితులు ఉన్నారన్నారు. 2040 నాటికి 28.9 మిలియన్లకు చేరుకోవచ్చని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. బాధితుల్లో ఎక్కువగా యువత ఉండడం బాధాకరమన్నారు. దేశంలో ఎక్కువగా మహిళలు రొమ్ము, పెద్దపేగుకు సంబంధించిన క్యాన్సర్లతో బాధపడుతున్నారన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

దంత సంరక్షణపై అవగాహన తప్పనిసరి



విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

విజయనగరం: దంతాల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు పిల్లలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని దంతవైద్య నిపుణులు డా. జె.పూజ అన్నారు. ప్రపంచ నోటి ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా విజయనగరం రింగ్ రోడ్‌లో ఉన్న భాష్యం స్కూల్‌లో ఎల్.కె.జి, యు.కె.జి పిల్లలకు, వారి తల్లిదండ్రులకు దంత సంరక్షణపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. వి డెంటల్ హాస్పిటల్స్ డైరెక్టర్ కె.ఎం.కె.రమేష్ పర్యవేక్షణలో డాక్టర్ పూజ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పిల్లల్లో వచ్చే దంత సమస్యలు, వాటి సంరక్షణ చర్యలను వివరించారు. తల్లిదండ్రుల సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం 150 మంది పిల్లలకు దంత వైద్య పరీక్షలు చేశారు. నోటి శుభ్రతను పాటిస్తున్న పిల్లలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామకష్ణ, ఇన్‌చార్జి సునీత తదితరులు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోండి



ఫూల్‌బాగ్‌లోని అటవీశాఖ కార్యాలయ ప్రాంగణంలో ట్రైనీలతో ఏడీ రమణమూర్తి, డీఎఫ్‌ఓ వెంకటేష్

విజయనగరం ఫూల్‌బాగ్: ఎఫ్‌బీఓ, ఎఫ్ఎస్ఓ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఏపీ స్టేట్ ఫారెస్టు అకాడమీ(రాజమండ్రి) అసిస్టెంట్ డైరెక్టర్ ఏపీ రమణమూర్తి అన్నారు. ఫారెస్టు బీట్ ఆఫీసర్, ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ శిక్షణలో భాగంగా శనివారం స్థానిక ఫూల్‌బాగ్‌లోని జిల్లా అటవీశాఖ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో విజయనగర వనం, తాబేళ్ల పెంపకం, తదితర అంశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. కార్యక్రమంలో డీఎఫ్‌ఓ ఎస్.వెంకటేష్, ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ బి.అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

మైలాన్ కార్మికుల ఔదార్యం



రాజేష్ పేరిట మొక్కను నాటుతున్న యూనియన్ సభ్యులు

పూసపాటిరేగ: మండలంలోని సీహెచ్ అగ్రహారంలో ఉన్న మైలాన్ పరిశ్రమలో స్టోర్ కీపర్‌గా పనిచేసే రాజేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. రాజేష్ మృతిపై స్పందించిన కంపెనీ స్టాఫ్ ఒకరోజు వేతనాన్ని మృతుని కుటుంబానికి అందజేశారు. మొత్త రూ.9.75 లక్షలు చెక్‌ను ఏఐటీసీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గణేష్‌పండా చేతులమీదుగా శనివారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. అనంతరం యూనియన్ కార్యాలయం ఆవరణలో రాజేష్ పేరిట మొక్కను నాటారు. కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఏ పతివాడ నారాయణస్వామినాయుడు, సర్పంచ్ కొత్తకోట శ్రీరాములు, యూనియన్ సభ్యులు వి.గోవింద, యశోదకుమార్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం



పూజా కార్యక్రమంలో పాల్గొన్న కోలగట్ల శ్రావణి, తదితరులు

విజయనగరం: నగరంలోని మయూరి జంక్షన్ వద్ద ఉన్న శ్రీసంపత్ ఆంజనేయస్వామి ఆలయ 12వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో విజయనగరం డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, మాజీ కౌన్సిలర్ కోలగట్ల వెంకటరమణి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వారికి తీర్థ ప్రసాదాలు అందించి, స్వామివారి శేషవస్త్రాన్ని అందజేశారు. మన సనాతన ధర్మాలను ప్రజలకు తెలియజేస్తూ, ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాలు చేపడుతున్న నిర్వాహకులను శ్రావణి అభినందించారు. ఆలయ నిర్వాహకులు ఇసరపు శేఖర్ మాట్లాడుతూ.. శాసన సభ్యులు కోలగట్ల వీరభద్రస్వామి సహకారంతో ఆలయాన్ని అభివద్ధి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘం నాయకులు ముద్దాడ మధు, నమ్మి ప్రసాద్, నమ్మి గోపి, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక లోక్‌అదాలత్



ప్రత్యేక లోక్ అధాలత్ నిర్వహిస్తున్న జడ్జి వాణి

శృంగవరపుకోట: స్థానిక మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టులో మండల న్యాయ సేవా కమిటీ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి ఎస్.వాణి అధ్యక్షతన శనివారం ప్రత్యేక లోక్‌అధాలత్ నిర్వహించారు. మనోవర్తి కేసులకు సంబంధించి కక్షిదారులను పిలిపించి వారికి రాజీ కోసం అవగాహన కల్పించారు. కుటుంబానికి సంబంధించిన తగాదాలను పరిష్కరించుకోవడం ద్వారా డబ్బులు, కాలం ఆదా చేసుకోవచ్చన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.సత్యాజీ, ఏజీపి కేశవరావు, పలువురు సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

రాజీయే రాజమార్గం

- సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు

రాజాం సిటీ: రాజీయే రాజమార్గమని, అందుకు లోక్‌అదాలత్ చక్కని వేదిక అని సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు అన్నారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో ప్రత్యేక లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కక్షిదారుల అంగీకారంతో చట్టరీత్యా రాజీకి అనుకూలమైన కేసులను లోక్‌అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. అదాలత్ తీర్పే అంతిమమన్నారు. లోక్‌అదాలత్‌లో పరిష్కారమైన సివిల్ కేసులకు సంబంధించి కోర్టు ఫీజులు వాపసు వస్తాయన్నారు. ఈ అదాలత్‌లో ఐదు క్రిమినల్ కేసులు పరిష్కరించారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి పీఎస్‌వీబీ కృష్ణసాయితేజ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కంచరాన రమణమూర్తి, ఏజీపీ ఎస్.పోలారావు పాల్గొన్నారు.